# దర్గామిట్ట కతలు

రంజాను వెల వొచ్చిందంటే మా యాది కళ చెప్పనలివిగానిది.

రోళ్లు పగిలే ఎండల్లో ఉమ్ము కూడా మింగకుండా వక్కపొద్దులుంటా – ఏనాడూ నమాజు చేయని ఆడోళ్లు కూడా అయిదు పూటలా నమాజులు చేస్తా – సాయింత్రమైతే సముద్రం మీది మంచి మల్లె చల్లటి గాలిలో కబుర్లు జెప్పకుంటా – యాదిలోకి సోడా బండ్లొస్తే సోడాలు తాగుతా – తియ్యటి వాసనల మల్లెపూల బుట్టలొస్తే గీచిగీచి బేరాలు చేస్తా – మేమంతా కరెంటు స్తంబాల కింద ఆడు కుంటా – దర్జీ సులేమాన్‌గాడు హిందీ పాటలు బెట్టి మేలుకుంటా... ఆ నెలంతా మా యాదిలో పగలూ రాత్రికి తేడాలా.

ఎందుకని తేడాలా అంటే – వక్కపొద్దు ఉండ టానికి 'సహర్' చేయాలి గదా. సహర్ చేయా లంటే అన్నం ఒండుకోవాలి గదా. అందుకని రాత్రి పదకొండు దాటినాక మా యాదిలోని యిళ్లల్లో పొయ్యిలు వెలిగేవి. అంత రాత్రప్పుడు 'సుయ్ సుయ్'మని తిరగమాత (దీనినే 'పోపు' అని కూడా అంటారు) శబ్దాలు వినిపించేవి.

పొగలుగక్కే పొయ్యిలెదురుగా కూచొని 'సహర్' వంట చేస్తానే కొందరు ఆడోళ్లు 'కుదువ బెట్టిన కమ్మలు ఈ పండక్కయినా యిడిపించరాదా' అనో – 'పిలకాయలకు బుస్‌కోట్లు కుట్టిస్తానన్నావు. అదయినా ఉందా? లేదా?' అనో వాళ్ల మొగోళ్లను డిమాండింగులు చేస్తా ఉండేవాళ్లు.

ఈ వంటతో,ఈ డిమాండింగులతో ఎవ్వడో పన్నెండు గెంటలకు పొణుకుంటారా? మళ్ల తెల్లారి నాలుగ్గంటలకే గణగణమని గెంటల మోత మొదలు!

'సహరుకు టైమయింది అమ్మలారా. లేవండి. నాయిలారా. నిదరమత్తు వొదిలి గబాల్న లేవండి' అని, మా మసీదు మౌజను సాహెబు గంట మోగిస్తా గడప గడపని నిద్ర లేపేసేవాడు. దెబ్బకు అన్ని యిళ్లల్లో లైట్లు వెలిగి యాది యాదంతా పట్టపగలైపోయేది.

రంజాను నెలలో మా యాది స్పెషలంటే సేమ్యాలే.

చేతి మిషనీలను మంచం కోళ్లకు బిగించి,వాటికి అటో కాలూ ఇటో కాలూ వేసి మా యాది ఆడోళ్లు యమా నైసుగా సేమ్యాలు తిప్పేవోళ్లు.

బోర్లించిన చేటల మింద సేమ్యాలు తిప్పి, యాదిలో మంచాలు పరిచి, వాటిని ఎండబెడతా వుంటే – తెలతెల్లంగా నగిషీలు నగిషీలుగా – మా ఇళ్ల ముందర ముగ్గేసినట్టుగా వుండేయవి.

మా యాదిలో నెల గడస్తా వుంటే ఒకో రోజు ఒకో యింట్లో సేమ్యాల అడావిడి!

ఒకో రోజు ఒకో యింటిలోనే సేమ్యాల అడావిడి ఎందుకురా నాయినా అంటే దానికో లెక్కుంది. మా యాదిలో ఉండేది రెండే రెండు సేమ్యాల మిషనీలు.

ఒకటి జాఫరయినోరి ఇంట్లో (ఇత్తడిది).


ఇంకొకటి ఖాదర్‌బీ ఇంట్లో (స్టీలుది).

ఈళ్లిద్దరూ ఈళ్లకు కావలసినోళ్లకు మాత్రమే వంతులవారీగా మిషనీలిచ్చేవారు గానీ పొరపాటున గూడా ఇంకో మనిషిని తాకనిచ్చేవారు గాదు.

తప్పీజారి మాబోటోళ్లు అడిగినా ఏదో ఒక వంక జెప్పి మర్యాదగా లేదనేసేవోళ్లు.

అయితే మా అమ్మ ఎట్ట న్యాక్ చేసిందో గానీ ఆ సంవత్సరం ఖాదర్‌బీకు కావలసిన వాళ్ల లిస్టులో చేరి పోయింది. దాంతో మాగ్గూడా సేమ్యాలు తిప్పకునే వంతొచ్చింది.

## కసాబ్ గల్లీలో సేమ్యాల ముగ్గు!



అదిగో – ఆడ మొదలయ్యేది కత!

మా ఇంట్లో సేమ్యాలు తిప్పడమంటే– మా 'నస్లిహా రామ్ నాయిన' పుణ్యమా అని– పదిళ్లలో సేమ్యాలు తిప్పడంతో సమానం.

యింట్లో ఏదైనా పని మొదలుపెడతా వుంటే ఆయన పెట్టే నస అంతా యింతా గాదు. యింక సేమ్యాలు తిప్పే పనంటే ఆయన్ను మోకులేసి పట్టాల్సిందే.

'ముందే జెప్తున్నా పని నీటుగా చేయండి మే. పిండి ఒటికి నాలుగుసార్లు జల్లెడ పట్టుకోండి. సేమ్యాలు లావుగా తిప్పబాకండి. సన్నగా నాజూగ్గా తిప్పండి' అని, ఆరోజు పని మొదలెట్టకముందే తగులుకునే శాడాయన.

అంతటితో వొదలకుండా మా అమ్మ చుట్టే తిరు గుతా 'సేమ్యాలు బయట ఆరబెట్టకుండా ఫ్యాను కిందఆరబెట్టండి మే. పచ్చి సేమ్యాల మీద గాలికి దుమ్ము పడిందంటే నోటిలో పెట్టలేము తల్లుల్లారా' అని జాగ్రత్తలు చెప్పడం మొదలుబెట్టినాడు.(వాటిని రెడ్లకు పంచాలిగదా. అదీ ఆయన బాద)

ఆయన పోరు పడలేక మా అమ్మ సలాము చేసి 'నువు నీ పనికి పో.నాయినా మా తిప్పలేవో మేం పడతాం' అంది.

ఆయన కదల్లా.

పిండి జల్లెడ పట్టేదాకా ఉండి, ఇత్తడి పళ్లెంలో దాన్ని ముద్దచేసే దాకా చూసి అప్పుడు కదిలినాడు. పోతా పోతా 'మద్యానానికల్లా తిప్పెయ్యండిమే' అని ఆర్డరేసి పోయినాడు.

ఆయన కదిలినాక, మా నాయినమ్మ సుబ్బ రంగా తలకు పోసుకుని, తెల్లటి చీర గట్టుకుని సేమ్యాల పని మొదలుబెట్టేదానికి పిండి ముందుర కూచునింది.

మా అన్నా నేనూ ఆపాటికే ఇస్కూల్ ఎగనాకి సేమ్యాలు ఆరబెట్టటానికి రెడీ అయిపోయినం.

మా జైబూన్ ఆపా (ఇల్లుగల్లామె) ఆరు చేటలు దెచ్చి 'ఇవి చాలుగదా' అంటూ వచ్చింది మనిషి సాయానికి. (సేమ్యాలు ఒకరే తిప్పలేరు. మనిషి మారతా వుండాలి).

ఆడదాకా అంతా బాగానే వుంది గానీ అప్పుడు మొదలయ్యింది జజ్జనక!

మిషినీకి వెళ్లిన మా అమ్మ ఉత్త చేతులు ఊపు కుంటా వచ్చి ఉసూరుమంటూ కూలబడింది.

'ఇప్పుడెట్ట చేసేదమ్మా. మిషినీ లేదంట గదా' అంది, బిక్క మొకం ఏసుకొని.

మా నాయినమ్మ బిత్తర పొయ్యింది.

'అదేంది మే. యివాళ మనకిస్తానంది కదా ఖాదర్‌బీ' అని అడిగింది.

'అవునుగదమ్మాయా. యివాళ మీ వొంతుగదా' అంది జైబూన్ ఆపా ఆశ్చర్యపోతా.

'అదెవుత్తో సవితి కచ్చేరిమిట్ట నుంచి వచ్చిందంట – మిషినీ గావాలని బలవంతం చేసిందంట – పినమ్మ కూతురు గదా... యియ్యకపోతే బాగుండ దని ఇచ్చి పంపిందంట యీ లంజ. కావాలంటే రేపిస్తానంటోంది' అని, ఖాదర్‌బీని తిడతా నెత్తి కొట్టుకుంది మా అమ్మ.

ఏం చేయాలో మా నాయినమ్మకు పాలుబోలా. మా నాయిన్ను తలుచుకునే సరికి ఆమెకు బయం పట్టుకుంది.

మా అమ్మ ఏడుపు గొంతుతో మొదలుబెట్టింది.

'ఈ సంగతి ముందే తెలుసుంటే పిండయినా కలువుకోకుండా వుండేవాళ్లం. ఆ మనిషి (మా నాయిన) అంతా కళ్లారా చూసుకొని పొయాడు. సాయింత్రానికి వచ్చి 'సేమ్యాలు ఏమి మే?' అని అడిగితే నేనేమి సమాదానం జెప్పేది? ఆ లంజ వల్ల పిండి పొయ్యింది. ఈ మనిషి చేతిలో చావొచ్చింది' అంది.

మా నాయిన కోపం జైబూన్ ఆపాకు కూడా తెలుసు గాబట్టి ఆమె కూడా గాబరా పడింది.

'జాఫరోళ్లదన్నా అడిగి తెద్దామంటే ఇవాళ అర నుస్తాన్ వొంతంట. వాళ్లింట్లో సేమ్యాలు తిప్పతు న్నారు' అందామె.

(మిగతా పక్క పేజీలో)

(దర్గా మిట్టకథ తరువాయి)

మా నాయినమ్మ గమ్మున అయిదు నిమిషాల సేవు ఆలోచించింది.

తర్వాత చివాలున లేచింది.

కుర్చీ ఎక్కి, ఆటక మీదున్న పట్టెమంచం బల్లలు దించింది. (మంచం మధ్యలో పరిచే సన్నటి బల్లలవి. ఆ మంచం పాడయితే ఎవ్వడో వాటిని పైన పడేశారు) ఆ బల్లల్ని బావి దగ్గరకు తీసుకెళ్లి శుభ్బరంగా కడిగింది. ఆనేక పాడి చీరతో బాగా తుడిచింది. వాటిని అటూ ఇటూ తడిమి చూస్తా 'ఇవే మన మిషనీలు' అంది.

మా అమ్మకు అర్ధమైపోయింది.

'చేతి సేమ్యాలా?' అంది ఆశ్చర్యపోతా.

'ఈ కాలంలో చేతి సేమ్యాలు ఎవరు చేస్తున్నా రమ్మా. చాలా టైము బట్టేపని గదా' అంది జైబూన్ ఆపా కూడా.

'ఆ నా కొడుకు చేతిలో తప్పించుకోవాలంటే ఇంతకు మించి వేరే దారిలేదు తల్లా. అయినా ముగ్గరం మూడు వైపులా కూచుంటే ఎంతసేపా?' అంది మా నాయినమ్మ.

మా అమ్మ ఆలోచించింది.

తన్నులు తినడం కంటే ఈ పనే మేలనిపించి 'సరే'నంది.

మా అమ్మ మొకం చూసి జైబూన్ ఆపా కూడా 'అట్నే కానీండి' అంది కొంగు బొడ్లో దోపుకుంటా.

యింకంతే.

ఆ ముగ్గురాడోళ్లకు తిండిలా. తిప్పల్లా.

మూడు మంచాలకు మూడు నిలువులుగా బల్ల లేసి, చీరలు పైకి లాక్కొని కూచొని, నిమిషానికొక సారి అరిచేతులకూ బల్లలకూ నూనె రాసుకుంటా, ఆ బల్లల మీదకు ఒంగి పిండి రుద్దుతా వుంటే...

నాయినా...దూదిలో మంచి దారం దిగినట్టు పిండి లోంచి సన్నటి సేమ్యాల పోగులు!


వాళ్లకి అంత పట్టూ అంత బలం యాణ్ణుంచి వచ్చాయో గాని మద్యానానికల్లా జబ్బలు అదిరిపొయ్యేలా పిండి రుద్దీరుద్దీ ముప్పయి చేటల సేమ్యాలు ఆరబెట్టేశారు!

అంత పనీ ముగించినాక ముక్కుల మీద కారే చెమటలు తుడుచుకుంటా, రొమ్ముల మీద పయిటలతో విసురుకుంటా వాళ్లు బల్లల మీది నుంచి లేచిన కాసేపటికి మా నాయిన యింటికి వచ్చాడు.

రావడంతోటే గబాల్న చేటల తట్టు చూశాడు.

ఆ తెల్లటి సేమ్యాలనీ వాటి నాజూకు అల్లికనీ మార్చి మార్చి తృప్తిగా చూసుకుంటా 'బలే వుండాయిగదమే సన్నంగా. ఎవురి మిషనీలో తిప్పారేంది' అని మురిసిపోతా వుంటే అంతసేవూ పడ్డ కష్టాన్ని మర్చిపోయి ఆ ముగ్గురు ఆడోళ్లు ఒకటేమైన నవ్వడం!

**–మహమ్మద్ ఖదీర్‌బాబు**



## మీ కోపతాపాలు ఇంట్లో కాదు ఇకపై చూపండి.
## కోపిష్టి పేజీ

కోపం ఒక్కోసారి కొంప కూలుస్తుంటుంది. చిరుకోపమైతే ఫర్వాలేదు గానీ పిచ్చికోపం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుంది.

ఉదాహరణకి కూరలో ఉప్పు తక్కువైనా, ఎక్కువైనా భర్తగారికి కోపమొచ్చి తినే పళ్ళేన్ని విసిరి కొడతాడు. అది కాస్త మూడో తరగతి చదివే అమ్మాయి మూతిమీద పడి పచ్చడవుతుంది. దీంతో భార్యకి పిచ్చికోపమొస్తుంది. మొగుణ్ణేం చేయలేక ఎల్‌కేజి చదివే పిల్లాడి వీపును బాదుతుంది. ఓ పక్క అమ్మాయి ఏడుపు. దీనికితోడు అబ్బాయి గగ్గోలు. వాడు ఏడుస్తూనే ఖోపంగా 'వుండండి మీ పని చెప్తా' నని అందాక రాసుకుంటూ రాసుకుంటూ వున్న బలపమ్ముక్కని కాస్తా ముక్కులో దోపుకుంటాడు.

ఇంక ఏముందీ? కొడుకునీ, కూతుర్నీ చెరోచంక వేసుకుని అక్కడా ఇక్కడా ఇల్లంతా గాలించినా వంద రూపాయలు దొరక్కపోయేసరికి పామునోట్లో వేలు పెట్టి 300 రూపాయలు అప్పుచేసి డాక్టరు దగ్గరకు వెళ్ళి కోపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవడం..

అయినా బుద్ధిరాదు కదా., ఇది జరిగి వారంకాకమునుపే మళ్ళా ఏదో ఒక కోపం.. మళ్ళా ఏదో ఒక అనర్థం..

ఆరోజుకి కోపం చిరాకు తెచ్చినా సంవత్సరం తర్వాత తలుచుకుంటే అవన్నీ సరదాగానో, భయంకరమైన పీడకలగానో గుర్తొస్తాయి.

**అలా మీ ఇంట్లో జరిగిన కోపతాపాలూ, వాటి పర్యవసానాలూ వ్రాసి ఈ కూపన్ కత్తిరించి కవర్ మీద అంటించి మరీ పంపండి. 'కోపిష్టిపేజీ' లో ప్రచురిస్తాము.**

చిరునామా: **'కోపిష్టిపేజీ'**
ఎడిటర్, ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక
రోడ్డునెం. 8, బంజారాహిల్స్, హైదరాబాద్-34.